క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం: భీమవరం కొవ్వాడ ఏరియాలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ లైన్లపై చెట్లు, కొమ్మలు, తొలగించేందుకు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కాస్మోక్లబ్, వంశీకృష్ణ నగర్ ఏరియా, వీఎస్ఎస్ గార్డెన్ ఫంక్షన్ హాల్ ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఐపీపీబీ ఖాతాలకు ఆధార్ సీడింగ్ తప్పనిసరి

భీమవరం: లబ్ధిదారులు సంక్షేమ పథకాల నగదు బదిలీకి బ్యాంక్ అకౌంట్–ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేయించుకోవాలని భీమవరం పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ కె.హరికృష్ణ ప్రసాద్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇండియన్ పోస్టు పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) అకౌంట్ కలిగిన ఖాతాదారులు ఆధార్‌కు బ్యాంక్ అకౌంట్ మ్యాపింగ్ చేయడం ద్వారా లబ్ధిదారులు నేరుగా నగదు లబ్ధిని తమ ఖాతాల్లో పొందవచ్చని పేర్కొన్నారు. భీమవరం డివిజనలో 8989 మంది లబ్ధిదారులు ఎన్‌పీసీఐ లింక్ కాని వారు ఉన్నారని, డివిజన్ పరిధిలో 287 పోస్టాఫీసుల ద్వారా ఆధార్ లింక్ చేసుకోవాలని సూచించారు. ఐపీపీబీ ఖాతాల్లో జమయ్యే పథకాల సొమ్ము అయినా పోస్టాఫీస్, యూపీఐ, ఎన్ఈఎఫ్‌టీ, ఐఎంపీఎస్ ద్వారా తీసుకోవచ్చని స్పష్టం చేశారు.

ట్యాంకర్‌ల ద్వారా తాగునీటి సరఫరా



ట్యాంకర్‌తో తాగునీరందిస్తున్న దృశ్యం

ఉండి: గ్రామంలోని ఏడో వార్డులో తలెత్తిన తాగునీటి సమస్యపై సర్పంచ్ కమతం సౌజన్య బెనర్జీ, ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ సీవీఎస్ రెడ్డి వెంటనే స్పందించారు. గురువారం ఉండి కొత్తపేట ఏడో వార్డు పరిధిలో తలెత్తిన తాగునీటి సమస్యపై స్థానికుల సమాచారం మేరకు అధికారులు వెంటనే స్పందించి వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశారు. ప్రజలు తాగునీటి సమస్యలపై వెంటనే సమాచారం ఇస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని ఎంపీడీఓ వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

పాలకొల్లు సెంట్రల్: మండలంలో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేసి బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం గురువారం మండలంలో అక్రమ మద్యంపై తనిఖీలు చేస్తుండగా వెదుళ్లపాలెం గ్రామంలో ఎస్.నారాయణ అనే వ్యక్తి వద్ద ఆరు మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. అతని నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధి బకాయిలను చెల్లించాలి

పెనుగొండ: ఉపాధి కూలీలు అర్ధాకలితో అలమటిస్తున్నారని కౌలు రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కేతా గోపాలన్ అన్నారు. ఆచంట మండలం కరుగోరుమిల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఇప్పటి వరకూ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీలో పనికి కొలతలు పెట్టి వేతనాన్ని చెల్లించడంతో ఉపాధి కూలీలు శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. ఉపాధి హామీ పథక లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తుందన్నారు. మోదీ ప్రభుత్వం పథకాన్ని నిర్వీర్యం చేయాలని చేస్తున్న కుట్రకు వ్యతిరేకంగా జూలై 9న దేశ వ్యాప్త సమ్మెకు ఉపాధి కూలీలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు కత్తుల శ్రీను, కంకిపాటి వెంకటేశ్వర రావు, యాకోబు, వెంకట లక్ష్మీ, నాగలక్ష్మీ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర పెంచాలి

పాలకొల్లు సెంట్రల్: ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులకు విత్తనం, ఎరువులు, పురుగుమందులు ధరల పెరుగుదలతో గిట్టుబాటు కాక అనేక కష్టాలను చవిచూస్తున్నారని పాలకొల్లు మండల జెడ్పీటీసీ నడపన గోవింద రాజులు నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ధాన్యం మద్దతు ధరపై ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరి రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలకు రూ. 69 పెంపుతో ఎలాంటి ఉపయోగం లేదన్నారు. ఈ పెంపుదల రైతులకు ఏమాత్రం ఉపశమనం కలిగించదన్నారు. పంట పెట్టుబడులకు అధికంగా ఖర్చులు అవుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కలుగజేసుకుని క్వింటాలుకు మరో రూ. 50 అదనంగా బోనస్ మద్దతు ధరగా పెంచి రైతులను ఆదుకోవాలన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గోవిందరాజులు నాయుడు డిమాండ్ చేశారు.

గడపగడపనా దూరమైన సేవలు

- 'రద్దు' పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం
- వలంటీర్లు, రేషన్ వాహనాల రద్దు



రేషన్ బియ్యం ఇంటింటికీ సరఫరా చేస్తున్న వాహనం (ఫైల్)

ఆకివీడు: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై సామాన్యులు పెదవి విరుస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని సేవలు ఇంటి ముంగిటే పొందిన లబ్ధిదారులు ఇప్పటిదాకా సంక్షేమ జాడ తెలియరాలేదని వాపోతున్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వ్యవస్థలను రద్దు చేయడమే పనిగా కూటమి ప్రభుత్వ పాలన ఉందని మండిపడుతున్నారు. ప్రజా సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లోనే తాకట్టు పెట్టిందని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. ఎన్నికల్లో చేసిన వాగ్దానాల్ని పూర్తిగా విస్మరించి, ప్రజా సంక్షేమం, అభివృద్ధిని పక్కనపెట్టి, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల, మంత్రుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని ఆరోపిస్తున్నారు. జగనన్న ప్రభుత్వంలో లెక్కకు మిక్కిలి సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేశారు. గడప గడపకూ వెళ్లి వలంటీర్లు తలుపు తట్టి సంక్షేమం అందజేశారు. తెల్లవారకుండానే పింఛన్ అవ్వా తాతల మంచం వద్దకు వచ్చేది. గడపగడపకూ కార్యక్రమాన్ని నిర్వహించి దశాబ్దాలుగా పరిష్కారం కాని, ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని పలు రహదారులు, పక్కా డ్రెయిన్ల నిర్మాణాలను పూర్తి చేశారు.

పారదర్శకంగా రేషన్ సరఫరా

రేషన్ బియ్యం ఇంటింటికీ సరఫరా చేసి ప్రజల మన్ననలు పొందారు. రేషన్ సరఫరా పారదర్శకతకు నిదర్శనంగా ఉంది. నియోజకవర్గంలో 45 వాహనాలతో ఇంటింటికీ వెళ్లి 72 గ్రామాల్లోని ప్రజలకు రేషన్ బియ్యం సరఫరా చేసేవారు. కూటమి పాలనలో ఏడాదిలోనే ఇంటింటికీ రేషన్ సరఫరా పథకాన్ని తుంగలో తొక్కేశారు. రేషన్ బియ్యం కోసం పనులు మానుకుని, షాపుల వద్ద క్యూలో నిలబడి, దూరతీరాల నుంచి వచ్చి బియ్యం తీసుకువెళ్లాల్సిన పరిస్థితిని తీసుకువచ్చింది.

నిలిచిన సేవలు

ఇంటింటికీ వచ్చి ప్రజల ఆరోగ్యాన్ని తెలుసుకుని తగిన మందులను వెంటనే అందజేసిన ఫ్యామిలీ డాక్టర్ కూటమి ప్రభుత్వంలో కనిపించడం లేదు. అన్నదాతకు వెన్నుదన్నుగా నిలిచిన రైతు భరోసా కేంద్రాలు కూటమి ప్రభుత్వంలో భరోసాను కల్పించలేకపోయాయి. రైతులకు సేవా కేంద్రాలు ఏవిధంగానూ ఉపయోగపడటంలేదు. ఆయా ఆర్బీకేల కేంద్రాల్లోని సామగ్రి, రైతులకు అవసరమయ్యే యంత్రాలు బూజుపడుతున్నాయి. నియోజకవర్గంలోని పలు సచివాలయాలు మూతపడే స్థితికి కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే సిబ్బంది కొరతతో ఆయా సచివాలయాలకు తాళాలు వేస్తున్నారు. రానున్న రోజుల్లో సిబ్బంది తక్కువైతే సచివాలయాల మనుగడకే ప్రమాదం ఏర్పడింది.

అందని సంక్షేమం



ఏడాది కాలంగా సంక్షేమ పథకాలు అందడంలేదు. ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోయాయి. మార్కెట్‌లో ధరలు ఆకాశానంటుతున్నాయి. బాదుడే బాదుడు అన్నారు. మరి ఇప్పుడు మరింత బాదుడుతో విలవిలలాడుతున్నాం. అమ్మ ఒడి లేదు. రైతు భరోసా పడలేదు. గ్యాస్ సబ్సిడీ డబ్బులకు కూడా వేయలేదు.

– నంద్యాల కృష్ణ, మందపాడు, ఆకివీడు మండలం

మంచినీటి కాలుష్యంపై ఆందోళన



మంచినీటి కాలుష్యంపై నిరసన వ్యక్తంచేస్తున్న సీపీఎం నాయకులు, మహిళలు

ఆకివీడు: కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతుందని స్థానిక 13వ వార్డులోని శ్రీనగర్‌కాలనీ వాసులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. కుళాయి నీరు పట్టుకున్న తరువాత ఆ నీటిని పరిశీలిస్తే దుర్వాసన వస్తుందని, పసర్ల రంగుతో నీరుందని సీపీఎం నాయకుడు పెంకి అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. నగర పంచాయతీ అధికారులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. ఇంటి అవసరాలకు, ఇతర అవసరాలకు కూడా ఉపయోగించలేనంత దారుణంగా నీరు ఉందని పేర్కొన్నారు. ఈ నీటితో స్నానాలు చేయడం వల్ల దురదలు వస్తున్నాయని మహిళలు ఆవేదన చెందుతున్నట్లు తెలిపారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని నగర పంచాయతీ అధికారులకు విజ్ఞప్తిచేశారు. అధికారులు స్పందించకపోతే నగర పంచాయతీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళలు ఎస్కే అమ్మాజీ, సుబ్బలక్ష్మి, దొడ్డి పద్మ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్కావెంజర్స్ లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని స్కావెంజర్స్ కాలనీలను గుర్తించి అర్హులైన లబ్ధిదారులకు ప్రథమ ప్రాధాన్యతగా ఇళ్ల స్థలాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ అధికారిని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మ్యాన్యువల్ స్కావెంజర్ నిషేధ, పునరావాస చట్టానికి సంబంధించిన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో మ్యాన్యువల్ స్కావెంజర్ కుటుంబ సభ్యులకు మెరుగైన అవకాశాలను కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. పొరుగు సేవల విధానంలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తూ చనిపోయిన వారి కుటుంబంలో ఉన్నవారికి తప్పనిసరిగా అవకాశం కల్పించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. సెప్టిక్ ట్యాంక్ పైపులను డైరెక్ట్ గా డ్రైనేజీల్లో కలిపితే క్రిమినల్ చర్యలు ఉంటాయని, ఈ విషయమై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సభ్యులు జయరామకృష్ణ, బొత్స లక్ష్మీదుర్గ, జిల్లెల సత్య సుధామ, డీఎస్‌డబ్ల్యూఓ బీవీఎస్‌బీ రామాంజనేయ రాజు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్పరాణి, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

దళిత యువకులపై దాడిని ఖండిస్తూ ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

భీమవరం: తెనాలిలో దళిత యువకులను నడిరోడ్డుపై పోలీసులు లాఠీచార్జ్‌ను ప్రభుత్వం వెంటనే హైకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద దళిత ఐక్యవేదిక భీమవరం శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుందర్‌కుమార్ మాట్లాడుతూ తెనాలిలో దళిత యువకులపై దాడి చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శాంతి భద్రతలు కాపాడాల్సిన ప్రభుత్వ పోలీసులు నిరంకుశ విధానాన్ని అవలంభించడం దారుణమన్నారు. ఈ ధర్నాలో పట్టిం సుభాకర్, జంగం మాణిక్యాలరావు, గెడ్డం జార్జి, అంబటి ఆనంద్ కుమార్, పి.సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ జ్యేష్టమాస జాతర ప్రారంభం



అమ్మవారి జాతర నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్ళమ్మ వారి జేష్ఠమాస జాతర మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయని ఆలయ సహాయ కమిషనర్ బుద్ద మహాలక్ష్మి తెలిపారు. అమ్మవారిని నిలబెట్టే కార్యక్రమం, శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి పుట్టింటి, అత్తింటి వారు అల్లూరి, మెంటే వంశస్తులుచే ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ నిర్వహించారు. భక్తులు జాతరలో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రేషన్ డీలర్లతో సమావేశం



రేషన్ డీలర్లకు సూచనలిస్తున్న తహసీల్దార్ సుందర్‌సింగ్

కాళ్ల: ప్రభుత్వం జూన్ ఒకటి నుంచి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరకుల పంపిణీ ప్రారంభిస్తున్న సందర్భంగా మండలంలో ఉన్న రేషన్ డీలర్స్‌తో తహసీల్దారు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. గురువారం తహసీల్దారు జి.సుందర్‌సింగ్ మాట్లాడుతూ నిత్యావసర సరకులు పంపిణీలో తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన అంశాలను ఆయన వివరించారు. ప్రతి నెల 1 నుంచి 15వ తేదీ వరకూ దుకాణాలు తెరిచి ఉంచాలని, ఉదయం, సాయంత్రం సమయపాలన పాటించాలన్నారు. దివ్యాంగులకు, అస్వస్థతత ఉన్నవారికి, 65 ఏళ్ల వయస్సు పైబడిన వారికి రేషన్ కార్డుపై ఇచ్చే సరకులు వారి ఇంటి వద్దే డీలర్ పంపిణీ చేయాలన్నారు. దుకాణం పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు.

క్రీడలతో మానసిక స్థైర్యం పెరుగుదల

పెనుమంట్ర: క్రీడలు విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని న్యూమేక్స్ కుంగ్–ఫూ మాస్టర్ ఎం.ఫణికుమార్ అన్నారు. మార్టేరు శాఖ గ్రంథాలయంలో గురువారం 31వ రోజు వేసవి శిక్షణ శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు కుంగ్–ఫూలో శిక్షణ ఇచ్చి ఇలాంటి క్రీడలు పిల్లల్లో మానసిక వికాసానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా ఇంగ్లిషు రిటైర్డు టీచర్ పి.సువర్ణగౌరీ, గ్రంథాలయాధికారి పీటీ శివకుమార్ పిల్లలతో ఇంగ్లిషు చదివించడంతో పాటు చెస్, క్యారమ్స్ వంటి క్రీడలను ఆడించారు. కార్యక్రమంలో ఎం.సత్యనారాయణ, టి.రాహుల్, డి.జశ్వంత్‌రెడ్డి, కె.కార్తికేయ, తదితరులు పాల్గొన్నారు.

విత్తన ఎంపిక ద్వారానే అధిక దిగుబడులు



ఆలమూరులో మాట్లాడుతున్న పి.వినయ్‌లక్ష్మి

పెనుమంట్ర: రైతులు సరైన విత్తన ఎంపికద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఉండి కృషి విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ పి.వినయ్‌లక్ష్మి అన్నారు. గురువారం పెనుమంట్ర మండలం ఆలమూరు గ్రామంలో నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మినీ కిట్ వెరైటీ గురించి వివరిస్తూ ముంపును తట్టుకునే రకాలను రైతులు ఎంపిక చేసుకుని ఎరువుల, తెగుళ్ల యాజమాన్యం పద్ధతులను వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు రైతులు సేద్యం చేయాలన్నారు. మరో ముఖ్య అతిథి పెదవేగి ఆయిల్ ఫాం పరిశోధనాస్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఎంవీ ప్రసాద్‌మాట్లాడుతూ డెల్టాప్రాంతంలో మెరక పొలాల్లో ఆశక్తిగల రైతులు ఆయిల్‌ఫాంను సాగుచేసుకోవచ్చని సూచించారు. ఉండి కేవీకే మత్స్యశాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, మార్టేరు పరిశోధనా స్థానం ఏడీఏ కె రాజేంద్రప్రసాద్, మండల వ్యవసాయ అధికారి ఎ.జ్యోత్స్నల , పెనుమంట్ర డీసీ చైర్మన్ వెలగల బులిరామిరెడ్డి, నీటి సంఘం డైరెక్టర్‌లు తేతలి వెంకట రామారెడ్డి, ఓడూరు లక్ష్మీపతి, కలిదిండి వెంకట రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి పథకాలు

పెనుగొండ: రైతులకు అభ్యున్నతికి, వారికి సాగులో అండగాఉండడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయని జిల్లా వ్యవసాయాధికారి జె.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఆచంట సొసైటీలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో పథకాలను వివరించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన, అన్నదాత సుఖీభవ, ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు, వ్యవసాయ యాంత్రికరణ, ధాన్యం కొనుగోలు పథకాలను వివరించారు. కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్ర వేత్తలు డాక్టర్ ఎస్.మల్లికార్జున రావు, డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్, డాక్టర్ వై.సుబ్బయ్య, డాక్టర్ పి.సహదేవరెడ్డి రైతులకు అనువైన వరి రకాలు మేలైన యాజమన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఏడీఏ అద్దాల పార్వతి, మత్స్య శాఖ ఏడీఏ ఆర్‌వీ ఎస్ వీ ప్రసాద ఉద్యాన వనశాఖాధికారి ప్రియదర్శిని, వ్యవసాయాధికారి బి.నాగరాజు, ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి పాల్గొన్నారు.

పుంతరోడ్లకు మోక్షమెప్పుడు?



పెనుగొండ అడ్డపుంత పుంత రోడ్డు



సత్యవరం పుంతరహదారి



దొంగరావి పాలెం పుంత రహదారి

పెనుగొండ: రైతులు ఆరుగాలం కష్టపడి పండించుకున్న పంటలను మిల్లులకు చేర్చుకోవడానికి ఉపయోగపడే పుంత రోడ్లు నిర్మాణాలకు మోక్షమెప్పోడో? అంటూ రైతులు ఎదురు చూపులు చూస్తున్నారు. 2014కు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల ఆధ్వర్యంలో పుంత రోడ్లు నిర్మాణాలు చేశారు. అనంతరం పుంత రోడ్లు నిర్మాణాల వైపు కన్నెత్తి చూడలేదు. వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల నిధుల కోత విధించడంతో పుంత రోడ్లు నిర్మాణాలకు ఆటంకం ఏర్పడింది. 2014 ప్రాంతంలో పెనుగొండ మండలంలో తామరాడ, వడలి, నడిపూడి, రామన్నపాలెం ల్లోనూ, పెనుమంట్ర మండలంలో రామేశ్వరం, జుత్తిగ, ఆలమూరు వంటి ప్రాంతాల్లో పుంత రోడ్లు నిర్మాణాలు దాదాపుగా రూ.60 లక్షలతో పూర్తి చేశారు. అనంతరం మరోసారి నిర్మాణాలు చేయడానికి రూ.80 లక్షలతో సైతం పలు పుంత రోడ్ల నిర్మాణాలు చేపట్టడానికి ప్రతిపాదనలు సైతం చేశారు. అయితే, నిధుల కొత విధించడంతో ప్రతిపాధనల స్థాయిలోనే అటకెక్కాయి. అప్పటి నుంచి పుంత రోడ్లపై ఆశలు పెట్టుకొన్నారు.

ఏఎంసీల నియామకంతో ఆశలు

పెనుగొండ, ఆచంట ఏఎంసీలకు నూతన కమిటీల నియామకంకు గ్రీన్ సిగ్నల్ లభించడంతో మరోసారి పుంత రోడ్లు నిర్మాణాలపై రైతులు విజ్ఞప్తిలు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా పెనుగొండ మండలం, పెనుమంట్ర మండలాల్లో పుంత రోడ్లు నిర్మాణాలు చేపట్టాలంటూ రైతులు విన్నవించుకుంటున్నారు. వడలి నుంచి దొంగరావిపాలెం వెళ్లే పుంత రహదారిలో వందలాది మంది రైతులు పంట ఉత్పత్తులను రోడ్డుపైకి తెచ్చుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారని, పుంత రోడ్డు నిర్మాణం చేపడితే కష్టాలు తప్పుతాయంటున్నారు. అదేవిధంగా పెనుగొండ అడ్డపుంత రహదారిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పుంత రహదారిలో రైతుల వరి పొలాలతో పాటు, కాలనీలు సైతం ఉండడంతో పుంత రహదారి నిర్మాణం చేపడితే ఉపయోగకరంగా ఉంటుందని కాలనీ వాసులు, రైతులు విన్నవించుకొంటున్నారు. దీంతో పాటు సత్యవరం పుంత రహదారి నిర్మాణం చేపట్టాలంటూ రైతులు కోరుతున్నారు. రామన్నపాలెం, వడలి, ఇలపర్రు, నడిపూడి, దేవల్లోనూ పుంత రహదారులు అభివృద్ధి చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వృద్ధులకు కంటి ఆపరేషన్లు

పాలకొల్లు సెంట్రల్: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు కంటి ఆపరేషన్లు చేయించారు. గురువారం అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు మాట్లాడుతూ 15 మందికి ఆపరేషన్లు చేయించామన్నారు.